

కార్తీకపూజల ఏర్పాట్లపై దేవదాయశాఖ ఉప కమిషనరు సమీక్ష 7

కారుని ఢీకొట్టిన లారీ

» ఒకరు మృతి, నలుగురికి గాయాలు 7

» తుని మండలం జగన్నాథగిరి వద్ద ఘటన

# తెగ.. తాగుడు!

» జిల్లాలో కొత్త మద్యం బ్రాండ్లను తెగ ఊదేస్తున్న మందుబాబులు

» గత అయిదేళ్లు నాణ్యమైన సరుకు దొరక్క కరువుతీరా తాగేస్తోన్న వైనం

» జిల్లాలో రోజుకు రూ.5.50కోట్లు దాటిపోయిన విక్రయాలు

» గత వైసీపీ పాలనలో చెత్త బ్రాండ్ల రోజూ అమ్మకాలు రూ.2.4కోట్లలోపే

» ఇప్పుడు ప్రముఖ బ్రాండ్లన్నీ దొరకడంతో అమ్మకాలు డబుల్

» జిల్లాలో ప్రైవేటు వైన్‌షాపులు తెరిచిన 9రోజుల్లోనే రూ.50కోట్ల విక్రయాలు

» రూ.99 చీప్ లిక్కర్ బ్రాండ్లలో జిల్లాకు కొత్తగా సుమో విస్కీ, ట్రిపికన్ బ్రాందీ

» అందుబాటులో ఖరీదైన బ్లాక్‌డాగ్ విస్కీ రాయల్ ఛాలెంజర్, ఎంసీ విస్కీ





మద్యం దుకాణంలో స్టాకు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలకు మందుబాబులు పోటెత్తుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తెగ తాగేస్తున్నారు. గత వైసీపీఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యం బ్రాండ్ల స్థానంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాణ్యమైన ప్రముఖ బ్రాండ్లన్నింటికీ ధరలు తగ్గించి అందుబాటులోకి తేవడంతో కరువుతీరా తాగేస్తున్నారు. తమకు అలవాటైన బ్రాండ్ల మద్యాన్ని వైసీపీ ఐదేళ్లపాటు లేకుండా చేయగా ఇప్పుడు మళ్లీ అవన్నీ రావడంతో ఫూటుగా తాగేస్తున్నారు. దీంతో జిల్లాలో మద్యం విక్రయాలు అమాంతం పెరిగిపోయాయి. రోజుకు ఏకంగా రూ.5.50కోట్లకు మించి అమ్మకాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రోజువారీ అమ్మకాలు రూ.2.40కోట్లలోపు ఉండేది. కానీ ఇప్పుడు ప్రైవేటు దుకాణాల్లో రోజుకు రెట్టింపు సరుకు అమ్ముడవుతోంది. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాలో కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభమైన తొమ్మిది రోజుల్లో ఏకంగా విక్రయాలు బుధవారం నాటికి రూ.50కోట్లు జరిగాయి. కాగా రూ.99కే చీప్‌లిక్కర్ హామీలో భాగంగా జిల్లాకు కొత్తగా మళ్లీ సుమోవిస్కీ, ట్రిపికన్ బ్రాందీ అందుబాటులోకి వచ్చింది. ఖరీదైన బ్లాక్‌డాగ్ విస్కీతోపాటు రాయల్ ఛాలెంజర్, ఎంసీ విస్కీ జిల్లాకు చేరింది.

## వచ్చింది వచ్చినట్లు..

జిల్లాలో మద్యం విక్రయాలు భారీగా ఊపందుకుంటున్నాయి. గత వైసీపీ సర్కారు హయాం నాటి అమ్మకాలతో పోల్చితే రెట్టింపు జరుగుతున్నాయి. ఈనెల 15నుంచి రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చింది. గత వైసీపీ సర్కారు హయాంలో కొనసాగిన ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసింది. దీంతో ఈనెల 14న జిల్లాలో 155 మద్యం దుకాణాలకు అధికారులు లాటరీ నిర్వహించి ప్రైవేటు వ్యక్తులకు వైన్‌షాపులను కేటాయించింది. వీటన్నింటికీ ప్రభుత్వ మద్యం డిపోనుంచి వివిధ రకాల మద్యం బ్రాండ్లను విక్రయాల కోసం సరఫరా చేసింది. వీటిలో గత వైసీపీ ప్రభుత్వం అమ్మకుండా పక్కన పడేసిన ప్రముఖ బ్రాండ్లన్నింటినీ మందుబాబులకు తిరిగి లభ్యమయ్యేలా చేసింది.దీంతో జిల్లావ్యాప్తంగా 9రోజులుగా మద్యం అమ్మకాలు రికార్డుస్థాయిలో జరుగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు జిల్లాలో పూర్తిగా నాసిరకం మద్యం విక్రయించింది. ఊరు పేరు లేని బ్రాండ్లను షాపుల్లో దించి రెట్టింపు ధరలకు అమ్మింది. మందుబాబులు ఎన్నోఏళ్ల నుంచీ తాగుతున్న బ్రాండ్లను కనిపించకుండా చేసేసింది. దీంతో చేసేదిలేక నాసిరకం మద్యాన్నే మందుబాబులు తాగేలా చేసింది. ఈ నేపథ్యంలో అప్పట్లో జిల్లాలో రోజువారీ మద్యం విక్రయాలు రూ.2.50కోట్ల లోపే జరిగేవి. కానీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా ఈనెల నుంచి ప్రైవేటు వైన్‌షాపులకు అనుమతి ఇచ్చి అన్నిరకాల బ్రాండ్లను విక్రయిస్తోంది. దాదాపు ఇరవైకిపైగా ప్రముఖ బ్రాండ్లను వైన్‌షాపుల్లో అమ్ముతోంది. దీంతో మందుబాబులు గత అయిదేళ్ల కరువును ఇప్పుడు తీర్చుకుంటున్నారు.

## బ్లాక్‌డాగ్.. సుమో..

గత అయిదేళ్లలో పేరున్న మద్యం బ్రాండ్లు ఏవీ జిల్లాలో అందుబాటులో లేవు. దీంతో కొత్త పాలసీ కింద కూటమి ప్రభుత్వం అన్ని రకాల ప్రముఖ బ్రాండ్లకు అనుమతులు ఇస్తోంది. దీంతో జిల్లాలో రోజుకో బ్రాండు దుకాణాల్లో లభ్యమవుతోంది. అందులోభాగంగా జిల్లాకు ఖరీదైన బ్లాక్‌డాగ్ విస్కీ వచ్చింది. ఫుల్ బాటిల్ ధర రూ.2,560, నిబ్ రూ.660. రాయల్ ఛాలెంజర్ విస్కీ ఫుల్ రూ.920, నిబ్ రూ.230. ఎంసీ విస్కీ సైతం జిల్లా మద్యం డిపోకు చేరుకున్నాయి. మందుబాబుల ఆరోగ్యం గుల్లకాకుండా రూ.99కే నాణ్యమైన చీప్ లిక్కర్ అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అందులోభాగంగా ఇటీవల జిల్లాకు రూ.99కే షాట్ విస్కీ వచ్చింది. తాజాగా అదే ధరకు చీప్‌లిక్కర్ విభాగంలో సుమో విస్కీ, ట్రిపికన్ బ్రాందీ సరుకు డిపోకు చేరాయి. ఇవి చెరో 400 కేసులు జిల్లాకు కేటాయించారు. త్వరలో పూర్తిస్థాయి స్టాకు రానుందని అధికారులు వివరించారు.

### ఆదివారం రూ.6కోట్లపైనే..

ఐదేళ్లపాటు మాయమైపోయిన ప్రముఖ కంపెనీ మద్యం ఇప్పుడు తక్కువ ధరకు లభ్యమవుతుండడంతో తెగతాగేస్తున్నారు. దీంతో రోజువారీ విక్రయాలు అమాంతం పెరిగిపోయాయి. ఒకప్పుడు రూ.2.50కోట్లలోపు విక్రయాలు కాస్తా ఇప్పుడు రోజుకు ఏకంగా రూ.5.50కోట్లకు పెరిగిపోయాయి. మధ్యలో ఆదివారం రోజైతే అమ్మకాలు రూ.6కోట్లు దాటిపోయాయి. అంటే గత అమ్మకాలతో పోల్చితే సరాసరి జిల్లాలో ఇప్పుడు రెట్టింపు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు తెరిచి బుధవారం నాటికి 9రోజులు అవుతోంది. ఈ వ్యవధిలో జిల్లావ్యాప్తంగా రూ.50కోట్ల వరకు మద్యం విక్రయాలు జరగడం విశేషం. మందుబాబులు కరువు తీరా తాగేస్తూ లోటు తీర్చుకుంటున్నారు. అన్నిరకాల బ్రాండ్లు వైన్‌షాపుల్లో దొరుకుతుండడం, ధరలు కూడా గతంతో పోల్చితే తగ్గడంతో అమ్మకాలు పెరగడానికి కారణమని ఎక్సైజ్ అధికారులు విశ్లేషిస్తున్నారు.

# నాడు నిర్లక్ష్యం.. నేడు చకచకా

» గొల్లప్రోలులో పాఠశాల భవనాల అసంపూర్తి పనులు పూర్తి

» కొత్తపల్లిలో పాఠశాలల్లో మంచినీటి ప్యూరిఫైర్లు ఏర్పాటు

» డిప్యూటీ సీఎం చొరవతో తీరిన విద్యార్థుల కష్టాలు

అర్థంతరంగా నిలిచిన పాఠశాల భవనాల గత పరిస్థితి





గొల్లప్రోలు పాపయ్యచావిడి వీధిలో రంగులు వేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన పాఠశాల భవనాలు

గొల్లప్రోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని పాపయ్యచావిడి వీధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబరు-2 భవనం అసంపూర్తి పనులు పూర్తయ్యాయి. గతంలో భవనం శిథిలావస్థకు చేరడంతో పూర్తిగా తొలగించారు. విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలోనే తరగతులు జరుగుతున్నాయి. అరకొర వసతులతో తరగతి గదులు సరిపోక వరండాలోనూ బోధన సాగిస్తున్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద పాఠశాల కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులపై శ్రద్ధపెట్టలేదు. పాఠశాల భవనాల నిర్మాణం పూర్తయినా అవసరమైన మౌలిక వసతులు కల్పించలేదు. పిఠాపురం నియోజకవర్గంలో ఇటీవల డిప్యూటీ సీఎం కార్యాలయ ఓఎస్డీ మధుసూదన్ ఇతర అధికారులు పర్యటించారు. గొల్లప్రోలులో పాఠశాలల పరిస్థితులను పరిశీలించినప్పుడు ఈ పాఠశాల భవనాల పరిస్థితి, విద్యార్థులు పడుతున్న కష్టాలు వారి దృష్టికి వచ్చాయి. వారి ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలియడంతో ఆయన స్పందించి కలెక్టరు షాన్‌మోహన్, విద్యాశాఖాధికారులతో మాట్లాడారు. తక్షణం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్‌ను సమకూర్చడంతోపాటు భవనాలకు రంగులు వేశారు. ఈ పనులు బుధవారంతో పూర్తయ్యాయి. త్వరలోనే ఈ పాఠశాల భవనాలను ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. కొత్తపల్లి మండలం కాలువదొడ్డి, వెంకటాపురం గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో మంచి నీటి సౌకర్యం లేదని గుర్తించి డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారి పవన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పవన్‌కల్యాణ్ స్పందించి సీఎస్ఆర్ నిధుల ద్వారా రెండు పాఠశాలల్లోను వాటర్ ప్యూరిఫైయర్లు ఏర్పాటు చేయించారు. తమ పాఠశాల్లో ఇబ్బందులు తీర్చిన పవన్‌కల్యాణ్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపల్లిలోని పాఠశాలలో వాటర్‌ప్యూరిఫైయ్యర్ వద్ద రక్షిత మంచినీరు పట్టుకుంటున్న విద్యార్థులు

మూలకు చేరిన.. సాగర సమాచార కేంద్రం 6

● నిరుపయోగంగా పరికరాలు

● మత్స్యకారులకు అందని సేవలు

## నేడు ఏపీజేఏసీ అమరావతి ఉమెన్స్ వింగ్ సమావేశం

» సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథ్

కాకినాడ సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వతేదీ సాయంత్రం 4 గంటలకు కాకినాడ కలెక్టరేట్ ఎదురుగాగల రెవెన్యూభవన్‌లో జిల్లా ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్స్ వింగ్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా సంఘ పటిష్ఠత, డివిజన్ కార్యవర్గ సభ్యులను కోఆప్షన్ ద్వారా నియమిస్తామన్నారు. మహిళల సమస్యలపై చర్చ తర్వాత కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలుస్తామన్నారు. అందువల్ల జిల్లాలోని మహిళా ఉద్యోగినులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు.

## 'క' అన్నివర్గాలను ఆకట్టుకుంటుంది

» సినీనటుడు అబ్బవరం కిరణ్



పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 'క' సినిమా అన్నివర్గాలను ఆకట్టుకుంటుందని సినీనటుడు అబ్బవరం కిరణ్ అన్నారు. సినిమా ప్రచారంలో భాగంగా బుధవారం కాకినాడ విచ్చేసిన సందర్భంగా నగరంలోని రామారావుపేటలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేఏ ప్రొడక్షన్స్‌లో నిర్మాత చింతా గోపాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మించారన్నారు. ఈనెల 31న దీపావళి రోజున ఈ చిత్రం విడుదలవు తుందని తెలిపారు. చిత్రం వినోదభరితంగా సాగుతుందని చెప్పారు.

## నేడు బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తడిచెత్తనుంచి బయో గ్యాస్‌ను ఉత్పత్తి చేసే బయోమెథనేషన్ ప్లాంట్‌ను కాకినాడ నగరంలోని దుమ్ములపేటలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్ నిర్మాణ పనులకు ఈనెల 24వతేదీ గురువారం దుమ్ములపేటలో రైల్వే ట్రాక్ వద్ద గల రుచి ఆయిల్ కంపెనీ సమీపంలో కమిషనర్ భావన ఆధ్వర్యంలో కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ శంకుస్థాపన చేయనున్నారు.

# సాగునీటి సంఘాలకు పునరుజ్జీవం.. లభించినట్లేనా?

» కూటమి ప్రభుత్వంలో ఎన్నికలకు సన్నాహాలు

» వచ్చేనెల 21 నుంచి 23 వరకూ నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్



సామర్లకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నవంబరు 21 నుంచి 23 వరకూ ఎన్నికలు నిర్వహించాలని ప్రకటించింది. ఈ మేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుల ఓటర్ల జాబితాలను సరిదిద్దే ప నుల్లో వీఆర్వోలు తలమునకలై ఉన్నారు.

### 13న ఓటర్ల జాబితా ప్రచురణ

వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలంటే సాగునీటి సరఫరా పుష్కలంగా ఉండాలని, అందుకు పూర్తిగా దోహదపడే నీటిసంఘాల ఎన్నికలు నిర్వహణే ప్రధాన మార్గమని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగానే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకువేసింది. మొత్తం ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను నవంబరు 13న ప్రచురిస్తారు. 20న నోటిఫికేషన్, 21 నుంచి 23 వరకూ ఎన్నికలు నిర్వహిస్తారు. 24 నుంచి 26 వరకూ డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 27 నుంచి 29 వరకూ ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. నీటి సంఘాలకు ఎన్నికైన సభ్యులు నీటి వినియోగ సంఘాలకు అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ నీటి వినియోగ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. ఈ డీసీలన్నీ కలిపి ప్రాజెక్ట్ కమిటీని ఎన్నుకుంటాయి. ఎన్నికలు సక్రమ నిర్వహణకు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారిని నోడల్ అధికారిగా ప్రభుత్వం నియమించనుంది.

గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చెరువులు, కాలువలు, ఆయకట్టు పరిధిలో ఏ చిన్న సమస్య వచ్చినా నీటి సంఘాల ప్రతి నిధులు స్పందించేవారు. యుద్ధప్రాతిప దికన పనులు చేపట్టేవారు. వైసీపీ ప్రభుత్వహయాంలో ఐదేళ్లు వాటి ఛాయలకు కూడా పోలేదు. సాగునీటి సమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 680 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఇవి గాక సుబ్బారెడ్డిసాగర్, ఏలేరు ప్రాజెక్ట్‌ల పరిధిలోనూ ఎత్తిపోతల పథకాల పరిధిలోనూ చెరువుల ఆయకట్టు పరిధిలోనూ ఉన్నాయి. చెరువుల్లో పూడికతీత, తూములు నిర్మాణం, మరమ్మతులు, కాలువల విస్తరణలు, జంగిల్ క్లియరెన్స్‌లు వంటి పనులు నీటిసంఘాలు చేపట్టేవి. వైసీపీప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి కార్యకలాపాలు నిలిచిపోయాయి. గతంలో.. ఏ ప్రభుత్వ హయాంలోనైనా నీటి సంఘాల పాత్ర కీలకంగా ఉండేది. ఏటా ఖరీఫ్, రబీకి ముందు నీటిసంఘాల ఆధ్వర్యంలో రైతులతో గ్రామసభలు నిర్వహించేవారు. చెరువులు, కాలువల అభివృద్ధికి పనులను గుర్తించేవారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించేవారు. ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి వాటిని నివేదించేవారు. వాటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. దీంతో చెరు వులు, కాలువల పరిధిలో శివారు ఆయక ట్టుకు సాగునీరు అందేది. ఐదేళ్ల వైసీపీ పాలనలో వాటి నిర్వహణే లేదు. ఆయా నీటి సంఘాలకు స్థాయిని బట్టి ఏఈ, జేఈ, డీఈఈ, ఎస్ఈ స్థాయిల్లో ఇరిగే షన్ ప్రత్యేకాధికారులుగా వ్యవహరించేవారు.

### నిధులు ఇలా..

సాగునీటి సంఘాలకు స్థానిక సంస్థల నుంచి నిధులు సమకూరుతాయి. క్రియాశీలకంగా ఉండే రైతు ప్రతినిధులను ఎన్నుకునేవారు. భూమి కలిగి పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులను ఓటర్లుగా చేర్చేవారు. మేజర్, మీడియం, మైనర్ సాగునీటి సంఘాలుగా విభజించి టెరిటోరియల్ మెంబర్లుగా ఎన్నుకునేవారు. వారిలో ఒకరు సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించేవారు. సంఘాల కాలపరిధి ఐదేళ్లు. ఈ సంఘాల సభ్యులను కలెక్టర్లు గుర్తిస్తారు. నిధుల విడుదలలో పారదర్శకతకు ఉమ్మడి అకౌంట్ ఉండేది. ఎంబుక్ ప్రాప్తికి పనులు పూర్తయిన వెంటనే బిల్లుల చెల్లింపులు జరిగేవి.

## కాకినాడ బీచ్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

» మంత్రికి ఎమ్మెల్యే నానాజీ వినతి



బీచ్ అభివృద్ధిపై మంత్రి దుర్గేష్‌తో చర్చిస్తున్న నానాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ బీచ్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మంత్రి దుర్గేష్‌ను కోరారు. అమరావతి ఏపీ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం ఆయన కలిసి బీచ్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎన్టీఆర్ బీచ్ నిర్వహణను గాలికొదిలేయడంతో బీచ్ కళతప్పిందన్నారు. ఎన్టీఆర్ బీచ్, బీచ్ ఫ్రంట్‌లను మరింత ఆహ్లాదంగా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతికి బీచ్‌ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాకినాడ బీచ్‌ను అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

# ఏలేరుకు.. పూడిక సమస్య

» గత వైసీపీ ప్రభుత్వ పాపం.. రిజర్వాయర్‌కు శాపం..

» పూడిక పెరిగి తగ్గిపోయిన నీటినిల్వల సామర్థ్యం





ఏలేరు జలాశయం.. (ఇన్‌సెట్‌లో) ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ఏలేశ్వరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలన ఏలేరు ప్రాజెక్టు పాలిట శాపంగా మారింది. కాలువలతోపాటు ఇతర అభివృద్ధి పనులను కూడా గాలికి వదిలేశారు అప్పటి పాలకులు. దీనివల్ల ఏలేరు ప్రాజెక్టులో పూడిక ప్రతిఏటా పెరిగిపోతోంది. పూడిక తీయాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ గత ఐదేళ్లలో నాటి అధికారులు ఇచ్చిన నివేదికలు బుట్టదాఖలయ్యాయి. ప్రాజెక్టు వరదలు వచ్చినప్పుడు రైతులు పంటలు కోల్పోతున్నారు. వర్షాలు లేని సమయంలో నీరు అందక పంటలు ఎండిపోతున్న దుస్థితి ఏలేరు ఆయకట్టు రైతులకు గ్రహపాటుగా మారింది. పూడికతో ఏలేరు పూర్తిగా నీరు నిల్వ చేసే అవకాశం కోల్పోతోంది. దీంతో ప్రాజెక్టు పూర్తి ఉపయోగం లేకుండాపోతోంది.

### సామర్థ్యం తగ్గిపోయి..

వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా పడతాయి. ఈ వరద నీటితోపాటు మట్టి, ఇసుక ఏలేరుకు చేరుతుంది. దీంతో పూడికతో నీరునిల్వ చేసే అవకాశం ప్రాజెక్టు కోల్పోతోంది. ఏలేరు రిజర్వాయర్ మొత్తం లెవెల్ 86.56 మీటర్లు, 24.11 టీఎంసీలు. 1991లో ఈస్థాయిలో నీరు నిల్వ చేసేవారు. కానీ పూడిక పెరగడంతో నిల్వ సామర్థ్యం 23.11 టీఎంసీలకి పడిపోయింది. 1 టీఎంసీ నీరు పది వేల ఎకరాలకు వ్యవసాయానికి ఉపయోగించవచ్చు. ఈ కారణంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి పెరిగిపోతోంది. ఏటా ఏలేరులో పూడిక పెదగడంతో నీరు నిల్వ చేసే సామర్థ్యం కోల్పోతోంది.

### జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రాజెక్టులో పూడిక తీసేందుకు ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు. వరదల సమయంలో మట్టి, ఇసుక ప్రాజెక్టుకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్యాచ్‌మెంట్ ఏరియాలో వరద నీరు ప్రవహించే మార్గాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించాల్సిన అవసరం ఎంతన్నా ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏలేరు ఆధారిత రైతులు కోరుతున్నారు.

### ప్రభుత్వానికి నివేదికలు

రిజర్వాయర్‌లో పూడిక ఏమాత్రం చేరిందో ఏటా సర్వే సంస్థలు నిర్ధయిస్తాయి. ఈ మేరకు ప్రతిపాదనలను ఉన్నత యంత్రాంగానికి నివేదిస్తాయి. ఇప్పటికే పలుమార్లు ఏలేరు అధికారులు గతంలో పూడిక సమస్యపై ప్రభుత్వానికి తెలియజేశారు. ఏలేరులో స్వల్ప పరిమాణంలో పూడిక చేరిన మాట వాస్తమేనని ప్రాజెక్టు ఈఈ ఎం.భాస్కరరావు స్పష్టం చేశారు.





# మరపురాని నటుడు 'మాడా'

- సినీనటుడు మాడా వెంకటేశ్వరరావుది మన దుళ్లే
- ఇంజనీర్ నుంచి యాక్టర్ దాకా ప్రస్థానం
- హాస్యమిళితమైన నటనలో మేటి
- నేడు వర్ధంతి

**హాస్యనట చక్రవర్తుల్లో ఒకరు మాడా వెంకటేశ్వరరావు. ఆయన స్వగ్రామం కడియం మండలం దుళ్ల. ఇంజనీరింగ్ చదివినా నటనపై ఆసక్తితో సినీరంగంలోకి వెళ్లి రాణించారు.**

(కడియం-ఆంధ్రజ్యోతి)

సినీజగత్‌కు హేమాహేమీలను అందించిన ఘనత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సొంతం. ఎంతోమంది నటీనటులు ఇక్కడి నుంచే సినీరంగంలోకి వెళ్లారు. తెలుగు చలనచిత్ర సీమలో తమకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. వారిలో ఒకరు మాడా వెంకటేశ్వరరావు. 'చూడు పిన్నమ్మ-పాడు పిల్లాడు' సాంగ్‌తో ఉభయ తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన నటుడు మాడా వెంకటేశ్వరరావు. ఆయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలోని కడియం మండలం దుళ్ల గ్రామం. మాడా పేరు చెబితే 'బాయా' అనే డైలాగు, 'చూడు పిన్నమ్మ పాడు పిల్లాడు' అనే పాట వెంటనే గుర్తుకొస్తుంది. దుళ్ల గ్రామంలో మాడా వీరభద్రుడు-అమ్మన్న దంపతులకు రెండో సంతానంగా 1935 జూన్ 4న మాడా వెంకటేశ్వరరావు జన్మించారు. మాడా వెంకటేశ్వరరావు కుటుంబం పెద్దదే. ఆయనకు అన్నయ్య, చెల్లి, ముగ్గురు అక్కలు ఉన్నారు. మాడా వెంకటేశ్వరరావు బాల్యం అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సాగింది. ఆయన ప్రాథమిక విద్య, హైస్కూల్, రాజమహేంద్రవరం, మండపేటల్లో సాగింది. అటుపై కాకినాడలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు.




మాడా వెంకటేశ్వరరావు.. దుళ్లలో ఉన్న ఇల్లు

ఇంజనీరింగ్ పట్టా పొందిన తర్వాత ఇంజనీరుగా జీవితం ప్రారంభించారు. ఆ వెంటనే ఆయనకు వివాహం జరిగింది. నలుగురు కుమార్తెలు కూడా. అయితే చిన్ననాటి నుంచి నాటకరంగంపై మక్కువ పెంచుకున్న మాడా ఇంజనీర్‌గా ఉంటూనే సినీరంగంలో ప్రయత్నాలు చేశారు. ఆయన ప్రయత్నం ఫలించి 'సుడిగుండాలు' సినిమాలో ఆయనకు అవకాశం దక్కింది. అప్పటి నుంచి సినీనటునిగా తనదైన శైలిలో పాత్రలు పోషిస్తూ తెలుగు ప్రేక్షకులను అలరించారు. ఒక ఇంజనీర్ తనకున్న లక్ష్యాన్ని సాధించడంలో సఫలమై నటుడిగా కూడా సక్సెస్ అయ్యారు. తెలుగు సినిమాలో బృహన్నల పాత్రలు చేయడంలో మాడాకు మరెవరూ సాటిలేరు. హాస్యాన్ని పండిస్తూ బృహన్నల హావభావాలను వ్యక్తపరచడంలో మాడా వెంకటేశ్వరరావుది విభిన్నమైన శైలి. తన అద్భుతమైన నటనతో హాస్యమిళితమై ప్రేక్షకులను అలరింపజేశారు. కథ సీరియస్‌గా నడుస్తున్న కొన్ని ఘట్టాల్లో మాడా ఎంట్రీతో హాస్యాన్ని పండించే పాత్రలు అనేకం రంజిపజేశాయి. మాడా 'సుడిగుండాలు' సినిమా మొదలు వెయ్యికి పైగా సినిమాలు నటించి తనదైన శైలి సృష్టించారు. జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన నటుల్లో మాడా ఒకరు. ఆయన వర్ధంతి నేడు.

ప్రపంచ పోలియో దినం




# పోలియోకు సెలవు!

**పోలియో అంటేనే.. ఒక విషాద జీవితం. బతికినన్నాళ్లూ కష్టాలతోనే కొనసాగాలి. ఇటు కన్నవారికీ, అటు పోలియోతో బాధపడేవారికీ నరకమే. కళ్లనిండా దుఃఖాన్ని మోస్తూ బతకాలి. ఈ మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల తరబడి కృషి సాగింది. పోలియో చుక్కలు కచ్చితంగా వేయడం ద్వారా ఈ మహమ్మారి నుంచి భారత్ కూడా బయటపడింది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలియో కేసులు నమోదు కావడం లేదు. ఏటా పోలియో చుక్కల కార్యక్రమం క్రమంతప్పకుండా జరుగుతోంది. నిజంగా ఈ పోలియో వ్యాధిని నిర్మూలించడం మానవాళి సంఘటితంగా సాధించిన గొప్ప విజయం. గురువారం ప్రపంచ పోలియో దినం సందర్భంగా కథనం.**

- గత 15 ఏళ్లుగా కేసులు జీరో
- పల్స్ పోలియోతో సాధించిన విజయం ఇది
- ఫలించిన ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కృషి
- చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత

(రాజమహేంద్రవరం అర్బన్/ ముమ్మిడివరం -ఆంధ్రజ్యోతి)

పోలియోను పూర్తిగా పారదోలినట్టు వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే ప్రకటించింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదుకావడం లేదు. నిరంతరాయంగా పోలియో చుక్కల కార్యక్రమం ద్వారానే ఇది సాధ్యపడిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 2014లోనే మన రాష్ట్రంతో పాటు దేశం మొత్తం పోలియోఫ్రీగా నిర్ధారిస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్రువీకరణ ఇచ్చింది. అయితే ఇప్పటికీ కొన్ని దేశాల్లో పోలియో కేసుల నమోదు ఉండడంతో మన దేశంలో కూడా ముందు జాగ్రత్తగా పోలియో చుక్కల కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తూ వస్తున్నారని చెబుతున్నారు. ప్రతి ఏటా జనవరి నెలలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తున్నారు. గర్భిణీలకు ముందస్తుగా చేసే రక్త పరీక్షల సందర్భంలో కూడా ఎలాంటి పోలియో అనుమానిత కేసులు నమోదు కావడం లేదని వైద్య, ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. ఏటా జనవరి నెలలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమైన తర్వాత దాదాపు నెలరోజులపాటు ఐదేళ్లలోపు చిన్నారులందరినీ వెతికి మరీ వారికి చుక్కలు వేస్తున్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సైతం స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఎక్కడా పోలియో కేసు నమోదు కాకపోవడానికి ప్రధాన కారణమని వైద్యాధికారుల అభిప్రాయం. పల్స్‌పోలియోకు ముందు ఇంటింటి సర్వే చేయడంతోపాటు చిన్నారులు ఉన్న ఇంటిని చాక్‌పీస్‌తో మార్కు చేస్తారని, ఎవరైనా ఊరికి వెళితే వాళ్లు వచ్చేవరకూ ఫాలోఅప్ చేస్తూనే ఉంటారని, దీనివల్లే పోలియో నిర్మూలన సాధ్యమైందని వారు చెబుతున్నారు. ఇటు ప్రభుత్వం, అటు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడమూ ఈ మహమ్మారిని తుదముట్టించడానికి దోహదపడింది. ఇక గతంలో పల్స్ పోలియో కార్యక్రమం ఏడాదికి రెండుసార్లు జరిగేది. తర్వాత జనవరి నెలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇదికాకుండా ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో నిర్మూలనకు రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం ద్వారా సచివాలయాల్లో నెలలో ప్రతీ బుధవారం, శనివారం జరుగుతోంది. పోలియో ఇమ్యునైజేషన్‌లో రెండు రకాల వ్యాక్సిన్లు వేస్తారు. ఓపీపీ (ఓరల్ పల్స్ పోలియో) చుక్కలు పుట్టినబిడ్డకు వెంటనే, ఆరువారాలు, పది వారాలు, 14 వారాలకు వేస్తారు. ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్)ను 6 వారాలు, 14, 9 నెలలు నిండిన తరువాత పిల్లలకు వేస్తారు. కలుషితనీరు తాగడం, బహిరంగ మలవిసర్జన వల్ల పరిసరాలు, మంచినీరు కలుషితమై ఈ పోలియో వ్యాధి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో గత 15 ఏళ్లుగా ఒక్క పోలియో కేసు నమోదుకాలేదు. దేశంలోనూ కేసులు లేకపోవడంతో పోలియో రహిత దేశ జాబితాలో ఉంది.




## గిరిజన గ్రామం.. ఊరంతా ఉద్యోగులే!

ఆర్కూర్ గ్రామం విశిష్టత

సాధారణంగా ఒక గ్రామంలో ఒకరో ఇద్దరో ప్రభుత్వోద్యోగులుంటారు. మహా అయితే పట్టుమని పదిమంది కూడా ఉండొచ్చు. కానీ ఆ గిరిజన గ్రామంలో ఏకంగా వంద మందికిపైగా ప్రభుత్వ కొలువులు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. కూనవరం మండలం ఆర్కూర్ గిరిజన గ్రామంలో సుమారు 100కు పైగా గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కాయకష్టంతోపాటు ఆగిరిజన గ్రామానికి చదువు విలువ తెలుసు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీలు పడి మరీ విజయం సాధిస్తున్నారు.

### మొదట గురువు ఆయనే..

ఆ గ్రామంలో మొదటగా ప్రభుత్వ ఉద్యోగం చేసింది చిచ్చడి రాజయ్య అని ఆర్కూర్ గ్రామానికి చెందిన గిరిజనులు చెప్పారు. తొలి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగం నిర్వహించారని రూ.3.75 పైసలతో అప్పట్లో జీతం తీసుకునేవాడని చెప్పేవారు. ఆయన స్ఫూర్తితోనే ఇక్కడ యువత ఉద్యోగం చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తిగా ఇప్పుడు ఆ గ్రామంలో 43 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇక పోలీస్ శాఖలో ఎనిమిది మందికిపైగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో మహిళా పోలీసులు ఉన్నారు. వెటర్నరీ డిపార్టుమెంట్‌లో ఏడుగురు, హెల్త్ డిపార్టుమెంట్‌లో 12 మంది, అంగన్‌వాడీలో ఇద్దరు, ఆర్టీసీలో ఒకరు, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో ఇద్దరు, ఫీల్డు అసిస్టెంట్లుగా ముగ్గురు, స్కూల్ ఆఫీస్ వర్కర్లుగా ఐదుగురు, పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఇద్దరు, బ్యాంకులో ఒకరు, వెల్ఫేర్ అసిస్టెంట్లుగా ఇద్దరు, డిజిటల్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్లుగా ఇద్దరు, అగ్రికల్చర్ సెరీ కల్చర్‌లో ఇద్దరు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా ఒక్కరు, రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఇద్దరు చేస్తున్నారు. వీరితోపాటు వివిధ సచివాలయాల్లో ఉద్యోగులుగా ఈ గ్రామానికి చెందినవారు ఉండడం గమనార్హం. ఇంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఆర్కూర్ గ్రామం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. అంతేకాకుండా ఈ గ్రామానికి చెందిన రాబోయే యువత సైతం ఉద్యోగాల వేటలో ఉన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

### నా ఊరే నాకు ఆదర్శం..

- పాయం కన్నారావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



మా ఊరులో ఇంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండడం గర్వకారణం. నేను పేదరికం వల్ల రాత్రి బడిలో అక్షరాభ్యాసం చేశా. అనంతరం గురుకుల పాఠశాలకు ఎంపికై అక్కడి నుంచి ఉపాధ్యాయులకు కావాల్సిన అర్హత సాధించా. ఇప్పుడు మా ఊరులో వందమందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రాబోయే యువత కూడా ఇదే మార్గంలో వెళ్లాలి.

- ఆంధ్రజ్యోతి/కూనవరం



సోలార్ ప్యానళ్లు పట్టుకుపోవడంతో ఖాళీగా ఉన్న స్టేండ్

మూలకు చేరిన..

# సాగర సమాచార కేంద్రం

- తుఫానులు, మత్స్య సంపద లభ్యతపై సమాచారం కోసం ఏర్పాటు
- నిరుపయోగంగా పరికరాలు
- మత్స్యకారులకు అందని సేవలు




సాగర సమాచారాన్ని తెలిపే డిస్‌ప్లే బోర్డు

తొండంగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారలకు తుఫాను హెచ్చరికలు చేరవేసేందుకు, మత్స్య సంపద లభ్యత గురించి సమాచారం ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన సాగర సమాచార వ్యవస్థ(ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం) మూలకు చేరి నిరుపయోగంగా మారింది. తొండంగి మండలం తీరప్రాంత గ్రామమైన దానవాయిపేటలో గతంలో దీన్ని ఏర్పాటు చేశారు. దీనిద్వారా అందే సమాచారాన్ని 100 నుంచి 150 కిలోమీటర్ల మేర సముద్రంలో వేట సాగించే మత్స్యకారలకు అందించే అవకాశం ఉంది.దీని కోసం బోట్లలో ఉన్న ప్రత్యేక పరికరాలు వారికి ఉపయోగపడేవి. తుఫానుల సమయంలో వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి రప్పించేందుకు, వారికి వాతావరణ సమాచారం అందించేందుకు ఈ వ్యవస్థ చక్కగా ఉపయోగపడేది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా మత్స్యకారలుకు సేవలు అందేవి. తుఫానుల సమయంలో విద్యుత్ లేకున్నా ఉపయోగపడేలా సోలార్ సిస్టం ద్వారా పనిచేసేలా దీన్ని ఏర్పాటు చేశారు. దీని కోసం భవనంపైన సోలార్ ప్యానళ్లు, బ్యాటరీలు ఏర్పాటు చేశారు. కేంద్రంలో స్క్రీన్‌తో కూడిన డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. కొంతకాలం దీన్ని సక్రమంగా నిర్వహించిన మత్స్యశాఖ మరమత్తు రావడంతో పట్టించుకోవడం మానేసింది. దీంతో విలువైన పరికరాలు నిరుపయోగంగా మారాయి.భవనంపైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లను కొందరు దొంగిలించుకుపోయారు. మత్స్యకారులకు అత్యం త అవసరమైన ఈ కేంద్రాన్ని తిరిగి తెరిపించాలని, ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న సోలార్ బ్యాటరీలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామికి లక్షతులసీ పూజ దృశ్యం

# బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు

- మూడోరోజు సుప్రభాత సేవ, అష్టోత్తర శతకలశాభిషేకం
- వేంకటేశ్వరస్వామి హోమం

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేదమంత్రాలు... మేళతాళ మంగళవాయిద్యాలు.. కళాకారుల ప్రదర్శనలు.. భక్తజన గోవిందనామస్మరణల నడుమ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నవనీత హారతి, సంకల్పము, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, విశేష అర్చన, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అష్టోత్తర, శతకళశాభిషేకం స్వా మివారి మూలవిరాట్‌కు లక్షతులసి పూజ, ప్రధా న హోమాలు వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు వేంకటేశ్వస్వామి హోమం, భక్తజనం గోవిందనామస్మరణలు వేద పండితులు నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ, ఫలపుష్పాలంకరణ, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రదర్శనల నడుమ స్వామివారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా నిర్వహించారు. అనంతరంరాత్రి శ్రీవారు కోదండరామ అలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించిన హనుమత్‌వాహనంలో ఆశీనులయ్యారు. భక్తజన గోవిందనామాల నడుమ వేలాది మంది భక్తులు తిరువీధులలో స్వామివారి వాహనసేవలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో ముదునూరివెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు కాయల జగన్నాథం-మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



శక్తివేషాలతో అలరిస్తున్న దృశ్యం



వాడపల్లి శ్రీవారికి సింహవాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

### వాడపల్లిలో నేడు..

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, తిరుప్పావడ సేవ, యోగనారసింహ అలంకరణతో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# అబ్బో.. ఎన్ని తేనెపట్లో

- కొమ్మ.. కొమ్మకూ ఒకటి
- జేఎన్టీయూకేలోని ఒకే చెట్టుకు అనేక తేనెపట్లు

జేఎన్టీయూకే, అక్టోబరు 23: సాధారణంగా తేనెపట్లు అటవీ ప్రాంతాల్లోని చెట్లకు ఎక్కువగా పడుతుంటాయి. పెద్ద రాళ్లకు, భవనాలకు కూడా పట్టడమే కాకుండా వాటిలో ఉండే తేనె చాలా నాణ్యతగా ఉంటుంది. ఎక్కడైనా కానీ ఒకటి లేదా రెండు తేనెపట్లు మాత్రమే పట్టడం చూస్తాం. కానీ కాకినాడ జేఎన్టీయూకే ఆవరణలోని ఫార్మసీ విభాగం ఎదురుగా బాలికల వసతిగృహం పక్కన గల ఓ మర్రి చెట్టు కొమ్మలకు ఎక్కువ తేనెపట్లు పట్టాయి. దీంతో అబ్బో ఆ చెట్టుకు ఎన్ని తేనె పట్లు పట్టాయో అని చూసిన ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతున్నారు. కొంతమంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, వర్సిటీకి వివిధ పనుల మీద బయటి నుంచి వచ్చేవారు, ఆ చెట్టు పక్కనున్న రోడ్డుపై వెళ్లేటప్పుడు ఆ తేనెపట్టులను ఆగి మరీ ఆశ్చర్యంగా చూస్తున్నారు.






# దేవాలయాల్లో కార్తీక మాస పూజలు, ఏర్పాట్లపై దేవదాయ శాఖ ఉప కమిషనరు సమీక్ష

పోర్టు సిటీ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాలయాల్లో ఏర్పాట్లపై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు సమీక్షించారు. కాకినాడ రామారావుపేటలోని ఆయన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని శివాలయాల ఈవోలు, జిల్లా అధికారులు, కార్యాలయాల పర్యవేక్షకులు హాజరయ్యారు. ఆయా దేవాలయాల్లో భక్తుల రద్దీ, తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఉప కమిషనరు కార్యాలయ పర్యవేక్షకుడు వి.సోమరాజు, జిల్లా దేవాలయాల శాఖాధికారి అల్లు భవాని పాల్గొన్నారు.



# వ్యానెక్కిన పడవ

నీటిలో ఉండాల్సిన పడవ వ్యానెక్కింది. కాకినాడ జిల్లా తొండంగి మండలంలోని తీర ప్రాంత గ్రామమైన గోపాలపట్నం నుంచి వేరే ప్రాంతంలో వేట సాగించేందుకు మత్స్యకారులు పడవను బుధవారం వ్యానుపై తీసుకు వెళ్తున్నారు. దీనిని దారి పొడవునా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

- తొండంగి (ఆంధ్రజ్యోతి)

# ప్రముఖ వైద్యుడు డాక్టర్ తేతలి కన్నుమూత



వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ వైద్య విధాన పరిషత్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ డీసీహెచ్ఎస్, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ (రిటైర్డు) డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు (79) బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొద్ది రోజులుగా ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన రాజమహేంద్రవరం దానవాయిపేటలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సివిల్ సర్జన్‌గా గోదావరి జిల్లాల్లో ఆయనకు ఎంతో పేరుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుడిగా పని చేసిన సమయంలో వేలాది మందికి ప్రాణదానం చేసి పేదల హృదయాల్లో దేవుడిగా నిలిచారు. 1945 ఆగస్టు 29న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన వెంకటేశ్వరరావు కర్నూలు వైద్య కళాశాలలో మెడిసిన్ చదివారు. అనేక హోదాల్లో పనిచేశారు. 1993లో సివిల్ సర్జన్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఆయనమంచి వైద్య సేవలందించడం ద్వారా అనతికాలంలోనే ప్రజలకు దగ్గరయ్యారు. డాక్టర్ తేతలి మరణవార్త తెలుసుకున్న అనేక మంది వైద్యులు, నగర ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారంరాజమహేంద్రవరం కోటిలింగాలు కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయి.



వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేస్తానని బెదిరిస్తున్న శ్రీనివాస్

# నాలుగు గంటలు... హైడ్రామా

పెద్ద చెరువు ఆక్రమణదారులకు పంచాయతీ నోటీసులు జారీ చేయడంపై నిరసన

వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యకు పాల్పడతానని యువకుడి బెదిరింపు

అధికారులు, పోలీసుల హామీతో దిగివచ్చిన వైనం

మండపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో పంచాయతీకి చెందిన పెద్ద చెరువు ఆరు ఎకరాల్లో విస్తరించి ఉంది. దాని చుట్టూ వున్న గట్టును ఆక్రమించుకుని 46 మంది నివాసం ఉంటున్నారు. ఈ చెరువును రూ.2.5 కోట్లతో పార్కుగా అభివృద్ధి చేసేందుకు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తొలగించాలంటూ వారికి పంచాయతీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. ఆక్రమణదారుల్లో 16 మంది ఇప్పటికే ప్రభుత్వం నుంచి స్థలాలు పొందారు. మరో 30 మందికి ప్రభుత్వ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. అయితే చెరువు గట్టు ఇళ్లకు సంబంధించి ఎటువంటి సంబంధం లేని గ్రామానికి చెందిన యువకుడు రామిశెట్టి శ్రీనివాస్ బుధవారం ఉదయం 7.30 గంటలకు చెరువు గట్టున ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కాడు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా ఆత్మహత్యకు పాల్పడతానంటూ హైరానా చేశాడు. 11 గంటల వరకు హైడ్రామా నడిచింది. వాటర్ ట్యాంకు పైనుంచి దూకేస్తానని, ఆక్రమణలు తొలగించమంటూ తనకు పంచాయతీ నుంచి లేఖ కావాలని పట్టుబట్టాడు. దీంతో లేఖ ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు ముందుకొచ్చారు. మండపేట రూరల్ ఎస్‌ఐ అక్కడకు చేరుకుని ట్యాంకుపై ఉన్న యువకుడిని కిందకు దింపే ప్రయత్నం చేశారు. పంచాయతీ సిబ్బంది, స్థానికులు పోలీసులు సంయుక్తంగా చేసిన ప్రయత్నం ఫలించింది. ఉదయం 11 గంటలకు అధికారులు, స్థానికుల కోరిక మేరకు యువకుడు వాటర్ ట్యాంకు పైనుంచి దిగి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కిందికి దిగివచ్చి అనంతరం యువకుడు విలేకరులతో మాట్లాడాడు. తన సమీప బంధువు, వరుసకు పిన్నికి చెరువు గట్టున ఇల్లు ఉందని, దానిని తొలగిస్తామని పంచాయతీ నోటీసు ఇవ్వడంతో తాను వాటర్ ట్యాంకు ఎక్కానని చెప్పాడు.

కాగా పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో యువకుడిని మండపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సుదీర్ఘ కాలం నుంచి తామంతా చెరువు గట్టుపై సొంతంగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, పార్కు నిర్మాణం కోసం వాటిని తొలగిస్తే తమకు దారేంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు ఎకరాల్లో విస్తరించి వున్న చెరువు ఎకరంపైగా ఆక్రమణలకు గురైందన్నారు. సర్వే అనంతరం పార్కు నిర్మాణం కోసం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అంతేతప్ప ఇందులో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు.



శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



సామర్లకోట రైల్వే స్టేషన్లో హెల్ప్ డెస్క్

# 'దానా' తుఫాన్ ఎఫెక్ట్

రైల్వే హెల్ప్ డెస్కుల ఏర్పాటు

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం వెంబడి 'దానా' తుపాను ప్రభావంతో కొన్ని రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని తీవ్ర ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు ఎప్పటికప్పుడు సత్వర సమాచారం తెలుసుకునేందుకు విజయవాడ డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్టు రైల్వే పీఆర్వో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందింది.

| స్టేషన్ | హెల్ప్ డెస్క్ నెంబరు |
| --- | --- |
| సామర్లకోట | 0884-2327010 |
| రాజమహేంద్రవరం | 0883-2420541 |
| తుని | 08854-252172 |
| తాడేపల్లిగూడెం | 08818-226162 |
| భీమవరం టౌన్ | 78159 09402 |
| ఏలూరు | 75693 05268 |
| అనకాపల్లి | 75693 05669 |
| గూడూరు | 0862-4250795 |
| నిడదవోలు | 08813-223325 |
| ఒంగోలు | 8592280306 |
| తెనాలి | 86442 27600 |
| గుడివాడ | 78159 09462, |
| నెల్లూరు | 0861-2345863 |
| విజయవాడ | 0866-2576924 |



నూతన కార్యవర్గ సభ్యులతో ఏపీ ఎన్జీవో నాయకులు

# ఏపీ జీఎన్ఏ జిల్లా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ) అధ్యక్షురాలిగా బూరిగ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి, కార్యదర్శిగా గట్టు ప్రమోద, కోశాధికారిగా కాకి వెంకటపరమేశ్వరి విజయం సాధించారు. కాకినాడ జీజీహెచ్‌లోని రేడియాలజీ సెమినార్ హాల్‌లో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏపీ ఎన్జీవో నాయకులు బలపరిచిన బూరిగ విజయలక్ష్మి తన ప్రత్యర్థి ధనలక్ష్మిపై 39 ఓట్ల ఆధిక్యతతో అధ్యక్షురాలిగా గెలుపొందారు. ఉపాధ్యక్షురాలిగా బోడే రాణి తన ప్రత్యర్థి అంజలి శ్రీవల్లిపై 49ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కార్యదర్శిగా పోటీ చేసిన గట్టు ప్రమోద తన సమీప ప్రత్యర్థి కెల్లా నళిని జయంతిపై 34 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కోశాధికారి పదవికి జరిగిన ఎన్నికలో కాకి వెంకటపరమేశ్వరి తన ప్రత్యర్థి మచ్చా సుజాతపై 91 ఓట్ల భారీ విజయం సాధించింది. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విప్పర్తి ఇందిర, కళ్యాణపుదేవి, జి.వీరలక్ష్మి, బత్తుల అక్కమ్మ, ఎం.సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు జి.రామ్మోహన్‌రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, ఎ.సత్తిరాజు అభినందించారు.

# 29న ఉద్యోగ క్రీడాకారుల జిల్లా స్థాయి ఎంపికలు

కాకినాడ అర్బన్, అక్టోబరు 23: రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో పాల్గొనడానికి జిల్లా స్థాయి మహిళ, పురుష క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 29న కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్‌లతో ఎంపికలు నిర్వహిస్తారు. ఆసక్తి గల ఉద్యోగ క్రీడాకారులు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా కాకినాడ డీఎస్ఏ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

# గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం గ్రామ శివారు మామిడితోటలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. 40 నుంచి 45ఏళ్ల వయసు ఉంటుందని, ఎత్తు 5.8 అడుగులతో చామనఛాయ రంగుతో ఉండి నీలం రంగు జీన్ ప్యాంటు, కాఫీ రంగు షర్టు వేసుకున్నాడన్నారు. గుండు ఉండడంతో సత్యదేవుని దర్శనానికి వచ్చి తలనీలాలు సమర్పించి ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు అన్నవరం ఎస్ఐ 9440796571 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



రెండో రోజు దీక్షా శిబిరంలో శివగణేష్, సూర్యచంద్ర (పైన)

బాధితులతో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు (కుడి)



# గుమ్మళ్లదొడ్డిలో ఉద్రిక్తత

» ప్రధాన రహదారిపై బాధితుల బైఠాయింపు » రెండో రోజుకు నిరవధిక నిరాహార దీక్ష

గోకవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమను మూయించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక సేవా కార్యకర్త పాటంశెట్టి సూర్యచంద్ర స్థానికులతో కలిసి చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం రోజుకు చేరుకుంది. వారికి మహిళలు, విద్యార్థులు, చిన్నారులు పెద్ద ఎత్తున సంఘీభావం తెలుపుతున్నారు. మా ఆరోగ్యానికి హాని కలిగించే ఈ ఫ్యాక్టరీ మాకొద్దు అని చిన్నారులు ప్లకార్డులు చేతబూనారు. శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ పరిశ్రమ అవసరమా? వేలాది మంది ప్రజల ఆరోగ్యం ముఖ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానికులు, చుట్టుపక్క గ్రామాల ప్రజల అభీష్టం మేరకు పరిశ్రమను ఏర్పాటు చేశారా అని నిర్వాహకుల తీరును ఎండగట్టారు. కాగా పరిశ్రమ నిర్వహణను వ్యతిరేకిస్తూ భారీ సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వందలాది మంది ప్రధాన రహదారిని దిగ్బంధించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిశ్రమను ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఒకానొక సమయంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసుల జులుం నశించాలి అంటూ ఆందోళనకారులు నినాదాలతో హోరెత్తించారు. దీక్షా శిబిరాన్ని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ రామచంద్రరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి అధికారి పి.ప్రదీప్‌కుమార్ బుధవారం సందర్శించారు. పరిశ్రమ వల్ల గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పటికీ ఇవ్వకపోవడంపై అధికారుల తీరును బాధితులు తప్పుబట్టారు.

# సెంట్రల్ జైలులో తనయుడితో మాజీ మంత్రి విశ్వరూప్ ములాఖత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23: కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో అరెస్టు అయి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న పినిపే శ్రీకాంత్‌తో అతడి తండ్రి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ములాఖత్ అయ్యారు. బుధవారం ఆయన సెంట్రల్ జైలుకు చేరుకుని ఇంటర్వ్యూ పెట్టుకుని సుమారు 30 నిమిషాల పాటు శ్రీకాంత్‌తో మాట్లాడినట్టు జైలు అధికారులు తెలిపారు. ఆయన జైలు వద్దకు వస్తున్నట్టు ఎవరికీ సమాచారం లేకుండానే వచ్చి వెళ్లారు. స్థానిక వైసీపీ నాయకులకు కూడా సమాచారం లేకపోవడం గమనార్హం.

# తపోవనంలో కార్తీక పూజలకు ఏర్పాట్లు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆధ్యాత్మిక పీఠం, పవిత్ర తాండవ నది పరివాహక కాశీ క్షేత్రం తుని శ్రీసచ్చిదానంద తపోవనంలో కార్తీక మాసంలో నిత్య శివ పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు స్వామీజీ శిష్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5న చతుర్థి నాడు శ్రీ గణేష్ సపర్య, నవంబరు 12 మంగళవారం ఏకాదశి నాడు దివ్యనామ సంకీర్తన, 13న బుధవారం ద్వాదశి నాడు శ్రీ రాధా కల్యాణం, 14న గురువారం విశ్వేశ్వర మహాభిషేకం, చతుర్దశి నాడు లక్ష తులసి అర్చన, 15న పూర్ణిమ నాడు శ్రీదేవి కుంకుమార్చన, లక్షపత్రి ప్రదీపోత్సవం, శ్రీరాధా జన్మోత్సవం, జ్వాలాతోరణం, మహారాసోత్సవం, మహాదీపోత్సవం, 28న గురువారం మహా ప్రదోషం, డిసెంబరు 1 ఆదివారం భానువార అమావాస్య, మహాసౌర అరుణ సపర్య, కౌముద్యుత్సవం నిర్వహిస్తారు. కార్తీక సోమవారాల్లో పగలు విశేష ఫలపంచామృత సహిత మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకము, ప్రదోష కాలంలో శ్రీరుద్రక్రమార్చన అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. పరమ పవిత్రమైన కార్తీక మాసంలో తపోవనంలో పూజలు చేసేందుకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 8106983711 నెంబరును సంప్రదించాలని కోరారు.

# కారుని వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారుని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారును కాకినాడ జిల్లా తుని మండలం జగన్నాథగిరి వద్ద రోడ్డు పక్కన ఆపారు. అందులో వున్న ఐదుగురు కారు దిగి మూత్ర విసర్జన చేస్తుండగా చెన్నై నుంచి ఒడిశా వెళ్తున్న లారీ వెనుక నుంచి అతి వేగంగా కారును ఢీకొట్టింది. పైలా వెంకట సత్య అప్పలస్వామి (66) అక్కడికక్కడే మృతి చెందగా గోవిందరాజులు, తారక్, కొండలరావు, రమణ తీవ్రంగా గాయపడ్డారు. భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది వచ్చి క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మృతి చెందిన వెంకట సత్య అప్పలస్వామి వెటర్నరీ డాక్టర్ కాగా, గాయపడిన నలుగురూ అతడికి సన్నిహితులు. వీరు విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నట్టు తెలిసింది. లారీ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి చెప్పారు.



ప్రమాద స్థలంలో లారీ (పైన) కారుని క్రేన్‌తో తొలగిస్తున్న హైవే సిబ్బంది (కింద)



(మృతుడు) అప్పల స్వామి (పాత చిత్రం)





# సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అదృశ్యం



దేవీపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పూడిపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సోయం శ్రీసౌమ్య అదృశ్యమైంది. ఈ నెల 21వ తేదీన సచివాలయానికి అని చెప్పి వెళ్లిన శ్రీసౌమ్య ఇంటికి తిరిగి రాలేదని ఆమె తల్లి పార్వతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేశారు. శ్రీసౌమ్య ఎవరికైనా ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# సీపీఎం సీనియర్ నాయకుడు సత్యనారాయణ హఠాన్మరణం



సత్యనారాయణ (పాత చిత్రం)

వీఆర్ పురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత పూనెం సత్యనారాయణ (54) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బుధవారం తమ పొలంలో పనులను పర్యవేక్షించేందుకు దంపతులిద్దరూ నూతిగూడెం వెళ్లారు. పనులను చూస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అక్కడి నుంచి రేఖపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు కోతులగుట్ట ఆసుపత్రికి రిఫర్ చేయగా వెంటనే అంబులెన్స్‌లో అక్కడికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ప్రస్తుతం రేఖపల్లి సర్పంచ్. సత్యనారాయణ మరణ వార్త తెలుసుకున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యనారాయణ రెండుసార్లు పెద్దమట్టపల్లి పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. ప్రజా సమస్యలపై అలుపెరగని ఉద్యమాలు, పోరాటాలు చేశారు.

### కట్టమూరులో 'పొలం పిలుస్తోంది'

పెద్దాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కట్టమూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల ఏవో కె.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఎంఐపీ పీడీ ఎన్.వరప్రసాద్, డీడీఏ బీవీ ఎస్‌సీ హరి వరిసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. మేడిది శ్రీనివాస్, మాదిరెడ్డి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## రహదారిపై గోతుల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉప్పాడ సెంటర్ నుంచి రైల్వేగేటు వరకూ వెళ్లే రోడ్డులో పడిన గోతులను పూడ్చిన దృశ్యం

పిఠాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిన గోతులను ఎట్టకేలకు పూడ్చారు. పట్టణంలోని ఉప్పాడ సెంటర్ నుంచి రైల్వేగేటు వరకూ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుతో పాటు పశువుల సంత సమీపంలోని గోతులు పడ్డాయని, రహదారి గతుకులమయంగా మారిందని, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఛిద్రమయిన రహదారులు శీర్షికతో వార్త ప్రచురితమయింది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఉప్పాడ సెంటర్ సమీపంలో పడిన గోతులను పూడ్చివేశారు. వన్‌వే రోడ్డు జంక్షన్, ఇతర ప్రాంతాల్లో ఉన్న గోతులు పూడ్చకపోగా, గతుకులమయంగా మారిన రహదారికి కనీస మరమ్మతులు నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఫోటోలో ఉన్న ప్రాంతంలో గోతులనే పూడ్చి మిగిలిన వాటిని అధికారులు విస్మరించడం విమర్శలకు గురవుతున్నది.

## రేపు మినీ జాబ్‌మేళా

పిఠాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఏదైనా డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసి 18 నుంచి 35 వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చునని చెప్పారు. రెజ్యూమ్‌తో పాటు ఆధార్, విద్యార్హతల జిరాక్స్ ప్రతులతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8639951441, 9949156583లో సంప్రదించాలని కోరారు.

## హుండీల లెక్కింపు

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హుండీలను బుధవారం లెక్కించారు. 3 నెలల 10 రోజులకు రూ.10,87,090 ఆదాయం వచ్చిందని ఈవో సత్యవాణి తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖతనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు. అలాగే అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయంలో హుండీలను వడ్డి ఫణీంద్రకుమార్ సమక్షంలో లెక్కించారు. 2నెలలకుగాను రూ.92,902 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 34మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.రమేష్, డి.రామారావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 34మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా 19మందికి ఒక్కొక్కరికీ రెండురోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. మరో 15మందికి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు సీఐ రమేష్ తెలిపారు.

## మద్యం షాపు వద్ద ధర్నా

కాకినాడ సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్యగల మద్యంషాపును తొలగించి వేరే ప్రాంతానికి మార్చాలని డెయిరీ ఫారమ్ సెంటర్ సమీపంలోని మద్యం షాపు వద్ద బుధవారం మహిళలు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీవాసులు ప్రదర్శనగా మద్యం షాపు వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించి కాలనీవాసులకు న్యాయం చేయాలని కోరారు.

# అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతూ..!


**ఏడేళ్లకే శిథిలావస్థకు చేరిన గదులు**

**పెచ్చులూడిపోతున్న పైకప్పులు**

**శ్లాబులకు పగుళ్లు**

**అందులోనే విద్యాబోధన**

**గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అగచాట్లు**





పాఠశాలలో పెచ్చులూడి పోతున్న తరగతి గదులు, గదులు శిథిలావస్థకు చేరడంతో తాళాలు వేసిన దృశ్యం



అసంపూర్తిగా నాడు-నేడులో నిర్మించిన తరగతి గదులు, పూర్తికాని గదుల్లోనే పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

గొల్లప్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం సర్వశిక్షాభియాన్ నిధులతో నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. పైకప్పులు పెచ్చులూడిపోతున్నాయి. దీనితో వాటికి తాళాలు వేశారు. మరోవైపు నాడు-నేడు కింద నిర్మించిన తరగతి గదులు అసంపూర్తిగానే ఉన్నాయి. గదులు సరిపడా లేక అందులోనే విద్యాబోధన సాగిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకప్పుడు రాష్ట్రంలోనే తొలిగా కంప్యూటర్లు ఉన్న హైస్కూలుగా గుర్తింపు పొందిన గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నేడు అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నది. ప్రస్తుతం పాఠశాలలో 447మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 15మంది ఉపాధ్యాయులు ఉన్నారు. హిందీ విద్యాబోధనకు ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండగా, ఆమె ఇన్‌చార్జి హెచ్ ఎంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

### పెచ్చులూడుతూ..

సర్వశిక్షాభియాన్ ద్వారా మంజూరైన నిధులతో ఉన్నత పాఠశాల ప్రధాన భవనాల మొదటి అంతస్తులో మూడు తరగతి గదులు నిర్మించారు. వీటి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అప్పుడే శిథిలావస్థకు చేరుతున్నాయి. తరగతి గదుల పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నాయి. శ్లాబులు బీటలు వారాయి. వర్షాల సమయంలో నీరు కారుతుండడం, ఎప్పుడు పైకప్పు పెచ్చులూడి పోతాయననే ఆందోళన నెలకొనడంతో తరగతి గదులకు తాళాలు వేశారు. వరండాలో కొంతకాలం తరగతులు నిర్వహించిన అక్కడా అదే పరిస్థితి కొనసాగడంతో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతి గదులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతి గదులు కంటే ముందు నిర్మించిన భవనాలు పటిష్టంగా ఉండగా ఇవి మాత్రం పెచ్చులూడి పడిపోవడం నాణ్యతా లోపాలను బహిర్గతం చేస్తున్నది.

### అసంపూర్తిగా నాడు-నేడు పనులు

నాడు-నేడు కింద వైసీపీ ప్రభుత్వం హయాంలో తొమ్మిది తరగతి గదులు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. అయితే నిధులు మాత్రం ఎనిమిది గదుల నిర్మాణానికి సరిపడా రూ.96లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. దీంతో 8 తరగతి గదులనే నిర్మించారు. గదుల నిర్మాణం పూర్తయినా ఇంకా అక్కడ సౌకర్యాల కల్పన, రంగులు వేయడం తదితరాలు మిగిలిపోయాయి. వీటి నిర్మాణం రెండున్నర సంవత్సరాలుగా సాగుతూనే ఉంది. హైస్కూలుకు సరిపడా తరగతి గదులు లేని నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న వీటినే విద్యాబోధనకు వినియోగిస్తున్నారు.

### చిన్న వర్షానికే ఆవరణలోకి నీరు

ఉన్నత పాఠశాలలో పలు అసౌకర్యాలు విద్యార్థులను వెన్నాడుతున్నాయి. మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్‌హాలు లేకపోవడంతో పూర్వ విద్యార్థులు నిర్మించిన స్టేజినే అందుకు వినియోగించుకుంటున్నారు. పాఠశాలలో నీరు పోయే డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఆవరణలో నీరు నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం సమయంలో మెట్లపై నుంచి నీరు కిందకు చేరుతున్నది.

### సమస్యలు పరిష్కరించాలి

ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టి సారించారు. ఇప్పటికే పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆర్వోప్లాంటును వినియోగంలోకి తీసుకొచ్చారు. డిప్యూటీ సీఎం పేషీ అధికారులు ఇప్పటికే ఇక్కడ ఉన్న సమస్యలను గుర్తించారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదుల నాణ్యతను పరీక్షించి మరమ్మతులు చేపట్టడం, నాడు-నేడు కింద చేపట్టిన 8తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తేవడంపై విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. తాగునీటి సమస్యను పరిష్కరించినట్టే మిగిలిన ఇబ్బందులను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం

**కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు**



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం చేస్తాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. జగన్నాథపురం అన్నవరం సత్యదేవ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో తైక్వాండో మెన్ అండ్ ఉమెన్ ఇంటర్ కాలేజీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడలో జాతీయస్థాయి క్రీడాకారులు ఉన్నారని, క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటా ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించి స్థిరపడాలన్నారు. గతంలో తైక్వాండో క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ఉండేదికాదని, ఇప్పుడు తైక్వాండో క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కేటాయిస్తున్నారన్నారు. రూ.66కోట్లతో కాకినాడ జగన్నాథపురంలో నూతనంగా స్టేడియం నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ప్రిన్సిపాల్ వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సువర్చల, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అబ్జర్వర్ వర్మ మాట్లాడారు. ఐక్యూ కోఆర్డినేటర్ వసంతలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ పరిమళారాణి, కోచ్ లక్ష్మణ్, చింతా సతీష్ పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు అరకొరగానే పరిహారం

**సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్**



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

పిఠాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలేరు వరదలు, అధికవర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు అరకొరగానే పరిహారం అందిందని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ విమర్శించారు. పిఠాపురం లయన్స్ కల్యాణమండపం వద్ద బుధవారం కోనేటి రాజు అధ్యక్షతన జరిగిన సీపీఎం రెండవ మహాసభలో ఆయన మాట్లాడుతూ కొద్దిమంది రైతులకే ఎకరాకు రూ.10వేలు పరిహారం చెల్లించారని, పంటలు నష్టపోయిన అందరికీ ఎకరానికి రూ.25వేలు వంతున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుకమేటలు వేసిన ప్రాంతాల్లో ప్రభుత్వమే చదును చేసి సాగుకు పనికి వచ్చేలా చూడాలని కోరారు. ఇసుకరీచ్‌ల వద్ద ప్రభుత్వమే వాహనాలు ఏర్పాటు చేసి ఉచితంగా ఇసుక అందించాలని సూచించారు. జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జి, కరణం ప్రసాద్, విశ్వనాథం, సూర్యనారాయణ, నందీశ్వరరావు, శీరందాసు రమేష్ పాల్గొన్నారు.

### నూతన కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

సీపీఎం పిఠాపురం పట్టణ, మండల కన్వీనింగ్ కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా కుంచే చిన్నా, సభ్యులుగా కోనేటి రాజు, కె.మణి, కె.నాగేశ్వరరావు, మణికంఠ, డి.తులసి, జి.వీరబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఎస్‌పీఎఫ్ సేవలు కీలకం



మొక్కలు నాటుతున్న సీఐ శ్రీధర్, సిబ్బంది

కాకినాడ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) సేవలు కీలకమని ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అన్నారు. ఎస్‌పీఎఫ్ ఆవిర్భవించి 33ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాకినాడ పోర్టులో బుధవారం ఎస్‌పీఎఫ్ రైజింగ్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీధర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం శ్రీధర్ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఎస్‌పీఎఫ్ సంస్థ సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ, తిరుపతి దేవస్థానం, విమానాశ్రయాలు, పోర్టులు, అన్నవరం, ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి అత్యంత కీలకమైన ప్రదేశాల్లో భద్రతా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. బడాఖానా నిర్వహించి క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారావు, ఏఎస్ఐలు శాంతేశ్వరరావు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## రక్త పరీక్షలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): వన్నెపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమం ద్వారా అనేమియా ముక్త భారత్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా అన్ని పాఠశాలలో రక్తపరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ధారిస్తున్నారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు, హెచ్‌ఎం వి.లోవ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సామర్లకోటలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ దుకాణం నిర్వహించారు. మెప్మా సిబ్బంది, మెప్మా సీఆర్పీలు హాజరయ్యారు. దుకాణాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య సందర్శించి వివిధ సరుకుల వివరాలను తెలుసుకున్నారు. పట్టణ డ్వాక్రాసంఘాలు తయారుచేసిన ఉత్పత్తులు డిజైనర్ శారీలు, డ్రస్సులు, పచ్చళ్ళు, ఫ్యాన్సీనగలు, మట్టితో తయారు చేసిన పూజా వస్తువులు, డ్రైఫ్రూట్స్, ఆర్గానిక్ సబ్బులు తదితర సరుకులు విక్రయాలను పరిశీలించారు. ప్రతీ బుధవారం వారపుసంతలో ఈ దుకాణం ఉంటుందని ప్రచారంచేశారు. కౌన్సిలర్లు బలుసు శ్రీనువాస్, పిల్లాడి సత్యవతి ఉన్నారు.



సరుకులు పరిశీలిస్తున్న కమిషనర్

## కూలీలందరికీ పని కల్పించాలి : ఏపీడీ



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న డ్వామా ఏపీడీ

కరప, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ వంద రోజుల పని కల్పించాలని డ్వామా ఏపీడీ జి.వసంతమాధవి సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం ఉపాధిహామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పని కావాలని కోరిన ప్రతీఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరుచేసి ఉపాధి కల్పించాలన్నారు. గ్రామాల్లో పనులు గుర్తించి తీర్మానాలు చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులకు గ్రామాల్లో చేపట్టే పనుల వివరాలు తెలిపి వారి సూచన మేరకు చేపట్టాల్సిన పనులుంటే గుర్తించాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 83శాతం మందికి పని కల్పించినట్టు తెలిపారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఏపీవో జీవీ రమణకుమార్, టీఏలు కె.ప్రకాష్, టి.రాజేంద్ర, స్వామి ఉన్నారు.

### వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పెనుగుదురు ఫీల్డ్‌అసిస్టెంట్ పులపకూర సునీతను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యయత్నం చేసుకునేలా ప్రేరేపించిన జనసేన నాయకులపై చర్యలు తీసుకోవాలని మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం నాయకులు డిమాండ్ చేశారు. డ్వామా ఏపీడీ వసంతమాధవి, ఎంపీడీవో అనుపమకు వినతిపత్రం సమర్పించారు. సంఘ నాయకులు చిన్నం వెంకటేశ్వరరావు, దాలిపర్తి శ్రీనివాస్, నవిలే రాజేష్, మాతా అప్పారావు, పులపకూర శుభామహేష్, వజ్రపు కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారానికే గ్రామసభలు'



తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామసభలో మాట్లాడుతున్న టీడీపీ నేత గంగసూర్యనారాయణ

తాళ్లరేవు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తుందని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నేత మందాల గంగసూర్యనారాయణ అన్నారు. బుధవారం చొల్లంగి పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ పి.త్రినాదరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మందాల మాట్లాడుతూ భూముల రీసర్వేలో సమస్యలు పూర్తిచేయడానికి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందన్నారు. రైతుల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, బూర్ల వెంకటరాజు, ఉపసర్పంచ్ స్వర్ణరాజు, డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ మహ్మద్‌షఫీ, వీఆర్వో శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**సామర్లకోట:** భూసమస్యలు పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వల్లూరులో నిర్వహించిన గ్రామ సభలో తహశీల్దార్ మాట్లాడుతూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు నమోదులు, జాయింట్ పొలాల విభజన, మ్యూటేషన్, పట్టాదారు పుస్తకంలో పేరు మార్పులు, వ్యవసాయభూములు లేఅవుట్ భూములుగా నమోదు అంశాలకు చెంది భూ యజమానులు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలకు 28 అర్జీలు అందినట్టు తహశీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, పి.సీతారామాచార్యులు, సర్వేయర్లు సీహెచ్.నరసింహమూర్తి, బి.జనార్ధన్, ఎస్.దయాకిరణ్, డి.మోషే, వీఆర్వోలు కె. చంద్రబాబు, ఆర్.కొండలరావు, ఎం.దుర్గాప్రసాద్, ఎండీ.ఖాదర్‌వల్లీ,టీడీపీ నేత సాంబమూర్తి ఉన్నారు.

**పెద్దాపురం:** క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. గోరింట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా రెవెన్యూ సమస్యలు ఎదురైతే పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. అనంతరం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్షన్ క్యాంపెయినింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాంతి భద్రతలపై సీఐ సమీక్ష

కాకినాడ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా అక్రమ నిల్వలు లేకుండా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కేవీఎస్ సత్యనారాయణ మహిళా పోలీస్ సిబ్బందికి బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై సమాచారమివ్వాన్నారు. సాంబమూర్తినగర్, రాగంపేట, పల్లంరాజునగర్, సూర్యనారాయణపురం తదితర ప్రాంతాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రత్యేక రక్షణ దళ సిబ్బంది రియల్ హీరోలు'

తాళ్లరేవు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రభుత్వ, ప్రవేటు రంగసంస్థలకు అవినీతిలేని సేవలందిస్తున్న ప్రత్యేక రక్షణ దళ సిబ్బంది రియల్ హీరోలని రిలయన్స్ సెక్యూరిటీ కమాండెంట్ శరత్‌చంద్ర అన్నారు. బుధవారం రాత్రి గాడిమొగ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ స్టేషన్ వద్ద 33వ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎస్‌పీఎఫ్ పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఎఎన్‌జీసీ హెచ్‌పీహెచ్‌టీ ప్రతినిధి భూమయ్య మాట్లాడుతూ కానిస్టేబుల్, నుంచి ఐజీదాకా ఎస్‌పీఎఫ్ సిబ్బంది సమాంతరంగా అవినీతి రహిత సేవలందించడం గర్వంగా ఉందన్నారు. కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. ఇనస్పెక్టర్లు గణపతి, ధనుంజయ్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎస్సీపేటలోనే ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి తాగునీటి వెతలు తీర్చాలని వాకలపూడి ఎస్సీపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీపేట గ్రామస్థులు వాకలపూడి పంచాయతీ కార్యదర్శి, ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రాలు అందించారు. వాకలపూడి ఎస్సీపేట, యాదవపేట, ఫిషర్‌మెన్‌కాలనీ ప్రజలందరికీ సరిపడే విధంగా అందుబాటులో మెరక ప్రదేశంలో ఉన్న సామాజిక స్థలంలోనే ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలన్నారు. జీ.రాజు, కె.అప్పలరాజు కుండల లక్ష్మి, జి.శివ, శ్రీను ఉన్నారు.



విచారణ చేస్తున్న ఏడీ జోగిరాజు

## పరిహారం అందకపోవడంపై ఏడీ విచారణ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 23: ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందకపోవడంపై వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ జోగిరాజు విచారణ చేపట్టారు. గొల్లప్రోలు మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామపరిధిలో వరదల కారణంగా పంటలు నష్టపోయిన తమకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం తమ ఖాతాలకు జమకాలేదని రైతుల నుంచి అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఏడీ జోగిరాజు చేబ్రోలు రైతు సేవా కేంద్రంలో పంట నష్ట జాబితాలను పరిశీలించి రైతులు నుంచి వివరాలు సేకరించారు. పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి ఖాతాలకు నగదు ఎందుకు పడలేదో తెలుసుకుంటామని ఏడీ చెప్పారు. రాత్రి వరకూ పరిశీలన కొనసాగింది. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, వీఏఏలు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఈవోకు వినతి

కొత్తపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే ఉపాధ్యాయ సంఘ సమావేశాల్లో సంఘ ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఎస్టీయూ కొత్తపల్లి మండల శాఖ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై బుధవారం ఎంఆర్సీలో ఎంఈవో బుర్రా వేణుగోపాల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల తాలూకు సర్వీస్ రిజిష్టరులో సంపాదిత సెలవులు నమోదు చేయాలని, ఉపాధ్యాయు హయ్యర్ స్టడీ ఎన్‌వోసీ, పాస్‌పోర్టులు త్వరగా డీఈవో కార్యాలయాలనికి పంపాలని, ప్రతీ 3నెలలకు ఒకసారి ఉపాధ్యాయసంఘ నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఆనందరెడ్డి, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాల స్థల పరిశీలన

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళికి బాణసంచా వ్యాపారాలు నిర్వహించుకునే వారికి స్థల కేటాయింపులపై మండలంలోని వేట్లపాలెం తదితర ప్రాంతాల్లో వివిధ శాఖలకు చెందిన అధికారులు వ్యాపారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కెనాల్ రోడ్లో విశాలమైన ప్రహరీ గల స్థలాన్ని పరిశీలించారు. సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఫైర్ అధికారి ఎం.శ్రీహరి జగన్నాథ్, సామర్లకోట సీఐ శ్రీకృష్ణభగవాన్, వీఆర్వోలు మామిడాల కామరాజు, కెవీవీ.సత్యనారాయణ, పి.కొండలరావు, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ

తాళ్లరేవు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ పుట్టినరోజు సందర్భంగా మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు ఆధ్వర్యంలో బుధవారం తాళ్లరేవు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సీతారామపురం దీరూబాయి అంబానీ ఎర్లీవెంటర్ సెంటర్‌లో దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారెల్ల వెంకటరమణ, బీర రాజేష్, ఆసుపత్రి సూపరిండెంట్ దొమ్మేటి స్నేహలత, ఎర్లీవెంటర్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

కరప, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి అప్పసాని వెంకటరాజేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిర్దేశితనాణ్యతాప్రమాణాలుపాటించాలన్నారు.

### పంట నష్ట పరిహారం అందలేదని ఫిర్యాదు

శంఖవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిచౌంగ్ తుఫాన్ వల్ల మండలంలో నష్టపోయిన 20 మంది రైతులకు పంట నష్ట పరిహారం అందకుండా వ్యవసాయాధికారులు నిర్లక్ష్యం వహించారని పలువురు రైతులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు రైతు గవరసాని మాణిక్యాలు తెలిపారు. తమకు పరిహారం జమయ్యేలాచూడాలని కోరామన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



చింతూరులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న శిరీషదేవి

## మూడు నెలలకోసారి 'ప్రజా దర్బార్'

### సమస్యల పరిష్కారమే ధ్యేయం: రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

చింతూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విలీన మండలాల్లో ప్రతి మూడు నెలలకోసారి 'ప్రజా దర్బార్' నిర్వహిస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. బుధవారం ఆమె చింతూరులో ప్రజా దర్బార్‌తో పాటు టీడీపీ సభ్యత్వ నమోదును విడివిడిగా నిర్వహించారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకి వినతులు అందజేశారు. శిరీషదేవి మాట్లాడుతూ రంపచోడవరంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. విలీన మండలాల ప్రజలకు దూరాభారం కాకూడదనే అభిప్రాయంతో మూడు నెలలకోసారి స్థానికంగా ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వినతికీ జవాబుదారీతనం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు కార్యాలయాలకు వచ్చినప్పుడు కొంతమంది అధికారులు పూర్తి స్థాయిలో స్పందించట్లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటువంటి అధికారులు తమ తీరు మార్చుకోవాలన్నారు. సభ్యత్వాల నమోదును నాలుగింతలు పెంచాలని సూచించారు. కూటమి నాయకులు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని సత్వరం పరిష్కరించాలన్నారు. టీడీపీ సభ్యత్వం కలిగి ఇటీవల మృతి చెందిన తులుగొండకు చెందిన కుంజా దూలమ్మ కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా అందజేశారు. టీడీపీ చింతూరు మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్, నాయకులు ఆచంట శ్రీనివాస్, పుట్టి రమేష్, బాచినేని శ్రీకాంత్, గడేసుల రంజిత్‌కుమార్, జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, ముత్యాల రామారావు, సయ్యద్ ఆసిఫ్, ఆకోజు నూకాచారి, మల్లెల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'చంద్రన్న బీమా' అమలు చేయాలని వినతి



ఎటపాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కణితి మధు చింతూరు ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే శిరీషదేవిని కలిసి ఒక సమస్యను విన్నవించారు. గత ఐదేళ్లలో మండ లంలో 54 మంది ఇంటి పెద్ద దిక్కు కోల్పోయా రన్నారు. వైసీపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని నిలుపుదల చేయడంతో బాధిత కుటుంబాలకు బీమా సొమ్ములు అందలేదని చెప్పారు. వారికి సాయం అందేలా ఈ విష యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని మధు చెప్పారు.




తోటపల్లి సబ్ పోస్టాఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు నిలుపుదల చేయాలి

ఎటపాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు విధుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం తపాలా కార్యాల యాల ఎదుట నిరసన తెలిపారు. రద్దు చేసిన ఎన్‌ఎఫ్ పీఈ, ఏఐపీఈయూ గ్రూప్-సి యూనియన్ గుర్తింపును తక్షణం పునరుద్ధరించాలని, పోస్టల్ యాక్ట్ 2023ను వెనక్కి తీసుకోవాలని, 8వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని, పాత పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని, కారుణ్య నియామకాల్లో ఉన్న నిబంధనలను తొలగించి 100 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని టార్గెట్లను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. సబ్ పోస్ట్‌మాస్టర్ కొండపల్లి నాగేశ్వరరావు, బీపీఎంలు చిలుకూరి శ్రీనివాసరావు, ఏబీఎం ఆదిలక్ష్మి, డాక్ సేవక్‌లు విజయకుమారి, కె.సుష్మ, దుర్గారావు పాల్గొన్నారు.

## 'సంకల్పం' అవగాహన సదస్సు



మోతుగూడెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయి జడ్పీ హైస్కూల్లో బుధవారం ఎస్‌ఐ శివకుమార్ 'సంకల్పం' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో ఎస్పీ అమిత్‌బర్దర్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందిం చాలన్నారు. గంజాయి పండించడం, గంజాయి రవాణా చేయడం వంటి సమాచారం తెలిస్తే 93811 23100 నెంబరుకు ఫోను చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు వారికి తగిన పారితోషికం ఇస్తామని ఎస్‌ఐ చెప్పారు.

# శిథిలావస్థలో తహశీల్దార్ కార్యాలయం

### పెచ్చులూడుతున్నా పట్టించుకోని వైనం

### ఆందోళనలో ఉద్యోగులు



కార్యాలయం లోపల పెచ్చులూడిన దృశ్యం

కోటనందూరు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కోటనందూరు తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగస్తులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే చాలు కార్యాలయంలోకి నీరు చేరి రికార్డులు నానిపోతున్నాయి. కా ర్యాలయం పరిస్థితి బాగోలేకపోవడంతో ఎప్పుడు ఏమవుతుందో అనే ఆందోళనలో ఉద్యోగులు ఉంటున్నారు. తరుచూ పెచ్చులూడి ఎవరోకరిమీద పడుతూనే ఉండడంతో బిక్కుబిక్కుమంటూ ఉద్యోగాలు చేయవలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కార్యాలయం పరిస్థితిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అసలు పట్టించుకోలేదని వాపోతున్నారు. దీనిపై గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు తగు చర్యలు తీసుకుని కొత్త భవన నిర్మాణం చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## 'జనవాణి'లో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్



అర్జీలు స్వీకరిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి జనసేన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

### వేములపాటికి సత్కారం

రాష్ట్రటిడ్కో చైర్మన్‌గా విజయవాడలో బుధవారం ప్రయాణంస్వీకారం చేసిన వేములపాటి అజయ్‌కుమార్‌కు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు చెప్పారు.

## 'ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నియమ నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల వ్యవసాయా సిబ్బంది ధాన్యం కొనుగోళ్లపై అవగాహన నిర్వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బిగ్రేడ్‌కు రూ.2300 వంతున మండలంలోని 14 కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోళ్లలో తేమ శాతం, ఇతర నిబంధనలు కూడా అనుసరించాలని ఏవో సూచించారు.

## బెనబాబుకు మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు

అన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆర్ఎంపీగా 2 దశాబ్దాలుగా సేవలందిస్తున్న పదిలం బెనబాబుకు మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు లభించింది. మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ కమిటీ సభ్యులు ఆయనకు అవార్డును అందజేశారు. బెనబాబుకు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ, నాయకులు,గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కోటనందూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదర్ విద్యాసంస్థలో విద్యార్థులకు సైబర్ నేరాలపై కోటనందూరు ఎస్‌ఐ టి రామకృష్ణ అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవిఆర్‌కె రాజు, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ అన్నసమారాధన

రౌతులపూడి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): గ్రామంలో దుర్గాదేవి ఆలయ ఆవరణలో బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. విజయదశమి ఉత్సవాలు ముగింపు సందర్భంగా శ్రీశ్రీనివాసా వర్తసంఘం అధ్యక్షుడు యడ్ల బుజ్జి అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సారాతో వ్యక్తి అరెస్టు

గండేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గోపాలపురంలో సారా తయారుచేస్తున్న వ్యక్తిని ఎస్‌ఐ యశివనాగబాబు అరెస్టు చేశారు. 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వసం చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు.

# నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

### మాజీ మంత్రి యనమల



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడవ కాలువ నిర్మాణ పనుల్లో భూములు, ఇల్లు కోల్పోయిన కుమ్మరిలోవ నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. తేటగుం టీడీపీ క్యాంపు కార్యాలయంలో పరిహారం చెల్లింపులకు సంబంధించి రెవెన్యూ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. సుమారు 115 మంది నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉందని, వారికిప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఒక్కో కుటుంబానికి రూ.6.10లక్షల పరిహారం చెల్లించనున్నట్టు యనమల తెలిపారు. దీనికి సంబంధించి విధి విధానాలపై పెద్దాపురం ఆర్డీవో రమణి, స్థానిక రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. సమావేశంలో పోలవరం ఈఈ గోవిందు, సర్వేయర్ దేవుడు తదితరులున్నారు.

## పలుచోట్ల పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

జగ్గంపేట రూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు పంట పండిచేటప్పుడు వ్యవసాయ అధికారుల నుంచి తగు సలహాలు, సూచనలను తీసుకోవాలని తద్వారా మెరుగైన పంటలు పండించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని జె.కొత్తూరు రాజపూడి గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై రైతు పొలాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. మండల ఏవో రెడ్ల శ్రీరామ్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

**తుని రూరల్:** హంసవరం, కొత్తూరు గ్రామాల్లో రైతులకు డ్రోన్ వినియోగంపై మండల ఏవో అశోక్‌కుమార్ అవగాహన కల్పించారు. హంసవరం సర్పంచ్ మేరీ అవినాష్, ఉద్యాన శాఖాధికారిని విజయలక్ష్మి, వ్యవసాయ సహాయకులు రాజు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

**కోటనందూరు:** కెఎమల్లవరం, జగన్నాధపురంలో జరిగిన కార్యక్రమాల్లో మండల ఏవో చంద్రశేఖర్ మాట్లాడారు. మాతిరెడ్డిబాబులు, ఎఈవో శివకుమారి, చింతకాయల అశ్విని ఉన్నారు.

## పాఠశాల చెంత పెంట కుప్ప చింత!



ఏ.కొత్తపల్లి ఉన్నత పాఠశాల వద్ద ఉన్న పెంట కుప్ప

తొండంగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతో ఉండాల్సిన పాఠశాల ఆవరణ పెంట కుప్పలకు నిలయంగా మారింది. ఏ.కొత్తపల్లి ఉన్నత పాఠశాల వద్ద స్థలంలో గ్రామస్తులు పెంట కుప్ప వేశారు. వర్షాలు కురినప్పుడు దీని నుంచి వచ్చే దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పెంట కుప్ప దోమలకు నిలయంగా మారి విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. పాఠశాల వద్దే పెంట కుప్పలు వేయడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వెంటనే దానిని తొలగించి మంచి వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.



ధర్మవరంలో కాశీ కావిడి కళాప్రదర్శన దృశ్యం

## అలరించిన 'కాశీ కావిడి'

ప్రత్తిపాడు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 88వ వార్షికోత్సవ మహోత్సవాలు సందర్భంగా బుధవారం నిర్వహించిన కాశీ కావిడి కళా ప్రదర్శన అలరించింది. రామహరే మొదటి భార్యగా కోనేటి బాబ్జి, రెండో భార్యగా సింగం ఈశ్వరరావు, కుమార్తెలుగా నానిపల్లి లోవరాజు, బొమ్మిడాల శ్రీనివాసులు నటించారు. మేకప్ సహకారాన్ని రాయి సుబ్బారావు,దాడి శ్రీనివాస్ అందించారు.

## 26న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

రంపచడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. డైకిన్, కేర్ ఫర్ యు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు రూ.10-20వేలు వేతనం చెల్లిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఆపై చదువులు చదివిన యువతీ, యువకులు ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు. గిరిజన యువత సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.



## రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

రాజవొమ్మంగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శంఖవరం మండలం నుంచి బదిలీపై వచ్చారు.

## 'ఓటర్లను నమోదు చేయించాలి'

కూనవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ కూనవరం మండల కమిటీ తరపున ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి నెలలో జరుగుతాయన్నారు. ఆఫ్‌లైన్/ఆన్‌లైన్‌లో ఓట్లు త్వరగా నమోదు చేయించాలన్నారు. రాంబాబు, సీత, శాంత, మహతి, నాగదుర్గ, ధనలక్ష్మి, జయలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి నిధులు : ఎంపీపీ

ఏలేశ్వరం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): రహదారులు పునఃనిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో బుజ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు రాకపోకలను దృష్టిలో పెట్టుకుని రహదారుల పునః నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రమణయ్యపేట గ్రామం నుంచి జె.అన్నవరం గ్రామం వరకు రహదారుల మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం సుమారు రూ.50లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తవగానే రోడ్డు మరమ్మతులు చేపడతామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, జ్యోతుల పెదబాబు, నూకతాటి ఈశ్వరుడు, టీడీపీ శ్రేణులున్నారు.

## బ్యాడ్మింటన్ టీమ్‌కు 'ఆదిత్య' విద్యార్థి ఎంపిక

గండేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగానికి చెందిన ఎం.సాత్విక్ ఇటీవల ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ నిర్వహించిన జేఎన్టీయూకే ఇంటర్ కాలేజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి జేఎన్టీయూకే బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపికైనట్టు ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకు చెన్నైలో ఎస్ ఆర్ఎం యూనివర్శిటీ నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సాత్విక్ పాల్గొంటాడని చెప్పారు. సాత్విక్, శిక్షణిచ్చిన కోచ్‌ను శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, డాక్టర్ రవి అభినందించారు.

## ఉచితంగా సత్యదీక్షా వస్త్రాల అందజేత

కిర్లంపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం అధికారుల ఆదేశాల మేరకు కిర్లంపూడి మండలం బూరుగుపూడి, వేలంక, గెద్దనాపల్లి, కిర్లంపూడి గ్రామాల్లో భక్తులకు బుధవారం ఉచితంగా దీక్షావస్త్రాలు, పూజా పుస్తకం, స్వామివారి మాల, ఫోటో అందజేశారు. ఈనెల 27 నుంచి 27 రోజుల దీక్ష ప్రారంభమవుతుందని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలిపారు. పసుపులేటి అర్జునరావు, సందకం సత్యకుమారి, మొగిలికల శివ, సంక్రాంతి గోపాలకృష్ణ, బెల్లంకొండ గోవింద్, పాటుశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.